## ఎస్టీపీపీలో ఎంఎన్‌జీఎం బృందం పర్యటన



ఎస్టీపీపీలో పర్యటిస్తున్న ఎంఎన్‌జీఎం బృందం సభ్యులు

జైపూర్, జూన్ 12: జైపూర్ ఎస్టీపీపీలో బుధవారం రాత్రి మహారాష్ట్ర నాచురల్ గ్యాస్ లిమిటెడ్ (ఎంఎన్‌జీఎం) బృందం పర్యటించింది. సింగరేణి సీఎండీ బలరాం నాయక్ ఆదేశాల మేరకు జీఎం ఓసీపీఎస్ డీవీఎస్‌ఎన్ రాజు ఆధ్వర్యంలో బృందం సభ్యులు ప్లాంట్‌లోని పలు ప్రదేశాలను సందర్శించారు. పవర్‌ప్లాంట్‌లో లిక్విడ్ నాచురల్ గ్యాస్‌ను వినియోగించడానికి కావాల్సిన సదుపాయాలపై అధ్యయనం చేశారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. నాచురల్ గ్యాస్‌ను ఇంధనంలా వాడడం మూలంగా కర్బన ఉదారాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, చీఫ్‌ఆఫ్‌వోఅండ్‌ఎం జైన్‌సింగ్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏజీఎం ఈఅండ్‌ఎం మదన్‌మోహన్ పాల్గొన్నారు.



మూడో యూనిట్ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని చదును చేయిస్తున్న దృశ్యం(ఫైల్)

# మూడో యూనిట్‌కు ముందడుగు పడేనా..?

- రాజకీయ కారణాలతోనే శంకుస్థాపన ఆలస్యం
- ప్రస్తుతం 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- మరో 800 మెగావాట్ల యూనిట్‌కు సన్నద్ధం
- సాధ్యమైనంత త్వరగా శంకుస్థాపన చేయాలని స్థానికుల డిమాండ్

## కాంట్రాక్ట్ సంస్థతో అగ్రిమెంట్ జరిగి నాలుగు నెలలు పూర్తి

మంచిర్యాల, జూన్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లిలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్(ఎస్టీపీపీ)లో మూడో యూనిట్ ఏర్పాటుకు అడుగు ముందుకు పడడం లేదు. పలు రాజకీయ కారణాలతో శంకుస్థాపన వాయిదా పడుతూ వస్తున్నది. 2015లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మూడో యూనిట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. తొలుత మూడో యూనిట్‌ను 600 మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించాలనుకున్నా, కేంద్ర ప్రభుత్వం సూపర్ క్రిటికల్ విధానంలో 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అనుమతులిచ్చింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయడానికి దాదాపు ఎనిమిదేళ్లు పట్టింది. పనులకు టెండర్లు పిలవడానికి మరో రెండేళ్లు గడిచిపోయింది. ఎట్టకేలకు ఈ ఏడాది ప్రారంభంలో టెండర్ల ప్రక్రియ పూర్తయింది. సింగరేణి సంస్థ 2016 జనవరి ఎస్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. తొలుత 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించడం లక్ష్యంగా పెట్టుకొని, తక్కువ సమయంలో రెండో యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చి మరో 600 మెగావాట్లకు విద్యుత్ ఉత్పత్తిని విస్తరించింది. ప్రస్తుతం 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా.. సింగరేణి సంస్థ సొంత అవసరాలకు 150 మెగావాట్లు వినియోగించుకుంటూ, మరో 1050 మెగావాట్లను రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జెన్‌కోకు విక్రయిస్తున్నది. మూడో యూనిట్ పనులు మొదలుపెడితే మరో మూడు, నాలుగేళ్లలో 800 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తిని సింగరేణి సాధించే అవకాశాలున్నాయి.

**టెండర్లు పూర్తయినా..శంకుస్థాపనకు గ్రహణం..**

మూడో యూనిట్‌కు కేంద్ర అనుమతులు, టెండర్ల ప్రక్రియ పూర్తికి పదేళ్ల సమయం పట్టించింది. ఎట్టకేలకు రూ.8500 కోట్ల అంచనా వ్యయంతో ప్లాంట్ నిర్మించేందుకు ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది ప్రారంభంలో సింగరేణి సంస్థతో హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్ సంస్థ ఒప్పందం సైతం కుదుర్చుకున్నది. వెంటనే ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. ప్లాంట్ ఏర్పాటు చేసే స్థలాన్ని చదును చేయించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతులు మీదుగా ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సిద్ధమయ్యారు. కానీ చివరి నిమిషంలో భట్టి టూర్ రద్దయింది. చివరకు గత నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి యూనిట్‌కు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. కానీ సీఎం పర్యటన సైతం రద్దు కావడంతో మూడో యూనిట్ పనుల ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. తొలుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో యూనిట్‌ను శంకుస్థాపన చేయించాలనుకున్నా.. ఆయన మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్‌ఆర్‌కు అత్యంత సన్నిహితుడి కావడంతో ఆయన ప్రారంభిస్తే తనకు కాకుండా పీఎస్‌ఆర్‌కు ప్లస్ అవుతుందని చెన్నూర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వివేక్ భావించారనే గుసగుసలు అప్పట్లో వినిపించాయి. అందుకని ఉపముఖ్యమంత్రితో కాకుండా సీఎం రేవంత్‌రెడ్డిని రంగంలోకి దించాలనే ఆలోచనలో వివేక్ ఉన్నట్లు సమాచారం. నాలుగు నెలల్లో మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో వివేక్‌ను మంత్రి పదవి వరించింది. ఈ నేపథ్యంలో వెంటనే ఎస్టీపీపీలో మూడో యూనిట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయాలనే డిమాండ్ స్థానికంగా వినిపిస్తున్నది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి అధికారులు మూడో యూనిట్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.



ఎస్టీపీపీలో మూడో యూనిట్‌కు ఏర్పాటు చేసేది ఇక్కడే



బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తాలోని ప్రభుత్వ భూమి

# బెల్లంపల్లిలో భూ వివాదం

## ప్రభుత్వ స్థలంపై స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు-ఆటో డ్రైవర్ల మధ్య గొడవ

బెల్లంపల్లి, జూన్ 12 : పట్టణంలోని కాంటా చౌరస్తాలోగల ప్రభుత్వ భూమిపై వివాదం నెలకొంది. ఓ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తమకు అన్నదానం చేసేందుకు ఆ స్థలం ఇచ్చారని చెప్పుకుంటుండగా, అదే స్థలంలో తాము కొన్నేళ్లుగా ఆటోలను నిలిపి కిరాయిలు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నామని, దానిని ఎవరికీ కేటాయించవద్దని ఆటో డ్రైవర్లు అధికారులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమవుతున్నది. బెల్లంపల్లి నుంచి భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని దహెగాం మండలాలకు కాంటా చౌరస్తా నుంచి ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. పట్టణానికి చెందిన ఓ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కొన్నేళ్లుగా అదే స్థలం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తోంది. అన్నదానం చేయడానికి తమకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని రెవెన్యూ అధికారులకు వారు విన్నవించుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆర్డీవో హరికృష్ణ తమకు ఆటో పార్కింగ్ స్థలాన్ని (నాలుగు గుంటలు) అన్నదానం నిర్వహించడానికి కేటాయించినట్లు సదరు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆటో యూనియన్ నాయకులు ఆర్డీవో హరికృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. కొన్నేళ్లుగా తాము అదే స్థలంలో ఆటోలను పార్కింగ్ చేసుకుంటున్నామ, దానిని ఎవరికీ కేటాయించవద్దని కోరారు. ఈ క్రమంలో ఆ స్థలం తమకు కేటాయించారంటూ ఈ నెల 11న సదరు స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నదానం చేసేందుకు టెంట్లు వేయడానికి ముందుకొచ్చారు. దీనిని ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు అడ్డుకున్నారు. ఇక చేసేదేమీ లేక యథావిధిగా పల్లెటూరి బస్టాండ్ ముందు అన్నదానం చేశారు. ఆటోలు పార్కింగ్ చేసుకుంటున్న స్థలాన్ని ఎవరికైనా కేటాయించినట్లు తెలిస్తే ఈ నెల 16న ఆటోలను ఎక్కడికక్కడ నిలిపి వేసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని యూనియన్ నాయకులు హెచ్చరిస్తున్నారు.

### ఆ స్థలం ఎవరిదీ కాదు



బెల్లంపల్లి పట్టణ నడిబొడ్డున పల్లెటూరి బస్టాండ్ వెనుక ఉన్న స్థలం ప్రభుత్వానిదే. ఆ స్థలం ఆటో డ్రైవర్లకుగాని.. జనహిత సేవా సమితి స్వచ్ఛంద సేవా సమితికి గాని ఎలాంటి సంబంధం లేదు. అన్నదానం కోసం స్థలం కావాలంటే నోటిమాటగా ఆ స్థలాన్ని చూపించామే తప్ప.. ఎలాంటి పత్రాలు ఇవ్వలేదు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే రెవెన్యూ చట్ట ప్రకారం చర్యలు తప్పవు.

**- హరికృష్ణ, బెల్లంపల్లి ఆర్డీవో**

# ఇక ఆర్థిక భారాన్ని మోయలేం

- 18 నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం
- గ్రామ పంచాయతీ సెక్రటరీలు
- ఎంపీవోకు ట్రాక్టర్ల తాళాలు అప్పగింత



గ్రామపంచాయతీల ట్రాక్టర్ల తాళాలను ఎంపీవో అజ్మత్ అలీకి అప్పగిస్తున్న పంచాయతీ సెక్రటరీలు

చెన్నూర్ రూరల్, జూన్ 12 : 'ఇక జీపీల ఆర్థిక భారాన్ని మోయలేం. 18 నెలలుగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. ఇక మా వల్ల కాదు' అంటూ పంచాయతీ కార్యదర్శులు బుధవారం చెన్నూర్ ఎంపీవో అజ్మత్ అలీకి ట్రాక్టర్ల తాళాలు అందజేశారు. తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల జాయింట్ కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు కిష్టంపేట పంచాయతీ సెక్రటరీ మధూకర్ ఆధ్వర్యంలో ఆర్థికపరమైన పనులు నిలిపివేస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీలందరూ తీర్మానం చేశారు. ట్రాక్టర్ల నిర్వహణతో పాటు వీధి దీపాలు అమర్చుట, విద్యుత్ మోటర్ల మరమ్మతులవంటి ఆర్థికపరమైన పనులు నేటితో నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ నిర్వహణలో భాగంగా ట్రాక్టర్ మెయింటనెన్స్, తాగునీటి నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ ఖర్చులతో పాటు పెండింగ్‌లోనున్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఓపీఎస్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌గా మార్చాలని, ఓపీఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 18 మంది పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

# పోల్ బిల్లు పెంచవద్దు

కలెక్టరేట్ ఎదుట కేబుల్ టీవీ ఆపరేటర్ల ధర్నా




మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కేబుల్ టీవీ ఆపరేటర్లు

శ్రీరాంపూర్, జూన్ 12 : విద్యుత్ పోల్ బిల్లు పెంచవద్దని మంచిర్యాల జిల్లా కేబుల్ టీవీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్ ధర్నా నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కేబుల్ టీవీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడ రాంరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దోమల రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనకు అన్ని మండలాల నుంచి కేబుల్ టీవీ ఆపరేటర్లు తరలివచ్చారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ కేబుల్ టీవీ ద్వారా ఇంటింటికీ ప్రభుత్వ కార్యక్రమాలు, తక్కువ చార్జీలతో ప్రత్యక్ష ప్రసారాలు చేస్తున్నామన్నారు. 30 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై విద్యుత్ అధికారులు కరెంటు పోల్‌టాక్స్ పెంచాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆపరేటర్లు ఎంత భారమైనప్పటికీని విద్యుత్ పోల్ బిల్లు చెల్లిస్తూనే వస్తున్నారని, తిరిగి పోల్ బిల్లు పెంచాలని చూడడం అన్యాయమన్నారు. తాము పోల్‌బిల్లు చెల్లిస్తున్నామని, కానీ నెట్ కార్పొరేట్ సంస్థలు అసలు ఏ బిల్లూ కట్టడం లేదని పేర్కొన్నారు. అనంతరం జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈకి వినతి పత్రం అందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కేబుల్ టీవీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధికార ప్రతినిధి భాస్కర్ల రాజేశం, మంచిర్యాల మండల అధ్యక్షుడు గాండ్ల సత్యం, నస్పూర్ మండల అధ్యక్షుడు పంబాల తిరుపతి, జైపూర్ అధ్యక్షుడు వెంకన్న, భీమారం అధ్యక్షుడు శ్రీకాంత్, చెన్నూర్ అధ్యక్షుడు శ్రీనివాస్, లక్షెట్టిపేట అధ్యక్షుడు భూమేశ్, దండేపల్లి అధ్యక్షుడు శంకర్, నాయకులు ఏల్పుల మల్లేశ్, గుమ్ముల శ్రీనివాస్, బొడ్డు లక్ష్మణ్, బర్ల రాజేందర్, రాగుల మల్లేశ్, పసికంటి రాజు, శేఖర్, అరిగెల రవీందర్ పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో చేతివాటంపై విచారణ

- ఆసరా నుంచి రూ. 16 చెల్లించడం లేదన్న లబ్ధిదారులు



బీపీఎంలను విచారిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

భీమిని, జూన్ 12 : ఆసరా పింఛన్ల పంపిణీలో పోస్టు మాస్టర్లు చేతివాటం ప్రదర్శిస్తున్న విషయం కలెక్టర్ దృష్టికి రాగా, ఆయన విచారణ చేపట్టాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వారు బీపీఎంలతో సమావేశం నిర్వహించారు. వికలాంగులకు రూ. 3016, వితంతువులు, వృద్ధులకు రూ. 2016 సర్కారు పింఛన్ల రూపంలో అందిస్తుండగా, బీపీఎంలు రూ. 16 ఇవ్వకుండా రూ. 2 వేలు, 3 వేలు చెల్లిస్తున్నారంటూ పత్రికల్లో కథనాలు ప్రచురితమవుతున్న నేపథ్యంలో వాస్తవాలను వెల్లడించాలని బీపీఎంలను ప్రశ్నించారు. అనంతరం భీమిని, చిన్నగుడిపేట గ్రామాల్లోని పింఛన్‌దారుల ఇండ్లకు వెళ్లిన అధికారులు విచారణ చేపట్టారు. రూ. 16 చెల్లించడం లేదని లబ్ధిదారులు తెలిపారు. బీపీఎంలు తీరు మార్చుకోకుంటే చర్యలుంటాయని హెచ్చరించారు. విచారణ అధికారి ఏపీవో అబ్దుల్ సలీం, డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, హెచ్ఆర్ మేనేజర్ రమేశ్, ఎంపీడీవో గంగామోహన్, ఏపీఎం వసంత్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుల జోలికొస్తే ఊరుకోం

- మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మాస్ కాంతయ్య

లక్షెట్టిపేట, జూన్ 12 : బీఆర్‌ఎస్ నాయకుల జోలికొస్తే ఊరుకునేది లేదని మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మాస్ కాంతయ్య హెచ్చరించారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్ రావు జన్మదినం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ఉత్కూర్ చౌరస్తా, పాత బస్టాండ్ సమీపంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని, బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాటిని తొలగించారని, వాటి స్థానంలో కాంగ్రెస్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. మున్సిపల్ అధికారులు ఈ ఫ్లెక్సీ లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శాతరాజు రాజన్న, మైనార్టీ నాయకులు షేక్ చాంద్, శంకర్రావు, గడికొప్పుల సతీశ్, పెట్టం తిరుపతి, చుంచు తిరుపతి, గోల్కొండ సత్తయ్య, జిన్ని వెంకటేశ్, షాబు, తిరుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య



బస్తీ దవాఖానను సందర్శించిన జిల్లా ఫోగ్రాం అధికారి ఏ ప్రసాద్

# ఇక ప్రతి రోజూ వైద్య సేవలు

- జిల్లా పోగ్రాం అధికారి ప్రసాద్
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- చెన్నూర్ బస్తీదవాఖనను సందర్శించిన అధికారి

చెన్నూర్, జూన్ 12 : చెన్నూర్ బస్తీ దవాఖానలో వైద్య సేవలు అందకపోవడంపై గురువారం 'నమస్తే తెలంగాణ'లో 'ప్రారంభించారు.. వదిలేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు జిల్లా ప్రోగ్రాం అధికారి ఏ ప్రసాద్ స్పందించారు. బస్తీ దవాఖానను సందర్శించారు. ఇకపై డాక్టర్ లక్ష్మీప్రసన్న ప్రతి రోజూ రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తారని తెలిపారు. బస్తీ దవాఖానకు అవసరమైన సిబ్బంది కేటాయిస్తామని, రెండు రోజుల్లో మందులు, వైద్య పరికరాలు, ఫర్నిచర్ ఏర్పాటు చేస్తామన్నారు. అప్పటి వరకు బస్తీ దవాఖాన డాక్టర్‌కు సహాయంగా అంగ్రాజుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాల్సిందిగా పీహెచ్‌సీ డాక్టర్ కృష్ణ తేజను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ ప్రతాప్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.